సాక్షి
తిరుపతి
ఆదివారం । 5 । జనవరి । 2025



ఈత రాక..ఊపిరాడక!

కోడూరు సమీపంలోని జలపాతంలో ఓ యువకుడు ఈత కొడుతూ ఊపిరాడక మృతిచెందాడు. - 8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

శేషాచల అటవీ ప్రాంతంలో 12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఓ స్మగ్లర్‌ను అరెస్ట్‌ చేసినట్టు పోలీసులు తెలిపారు. - 8లో



పరీక్ష నెగ్గితేనే పింఛన్‌

పరీక్ష నెగ్గితేనే ఇక పింఛన్‌. లేకుంటే కడుపు మాడ్చుకోవాల్సిందే. ఈ మేరకు అర్హత పరీక్షకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. - 8లో

న్యూస్‌రీల్‌

శ్రీవారికి అరుదైన వస్త్రం



ఆలయం వెలుపల టీటీడీ ఈవోకు అగ్గిపెట్టె

తిరుమల: అరుదైన వస్త్రాన్ని తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువకుడు శ్రీవారికి సమర్పించాడు. స్వామి వారికి సమర్పించే వస్త్రాలు ప్రత్యేకంగా ఉండాలనే ఉద్దేశంతో రెండు రకాల చీరలు తాయారు చేశారు. తెలంగాణ రాష్ట్రం రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన నల్ల విజయ చేనేత కళాకారుడు. ఎన్నో చేనేత వస్త్రాలు తాయారు చేయడంలో ఆయన నేర్పరి. స్వామి వారికి ప్రత్యేక వస్త్రాన్ని సమర్పించాలని సంకల్పించాడు. 5.5 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పుతో రెండు చీరలు తయారు చేశారు. గతంలో సైతం స్వామి వారికి అగ్గిపెట్టెలో పట్టే రెండు రకాల చీరలను తాయారు చేసి సమర్పించాడు. శనివారం శ్రీవారి ఆలయం వద్ద టీటీడీ ఈవో శ్యామల రావుకు చూపించారు. ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని హుండీలో చీరను సమర్పించనున్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ తక్కువగా ఉంది.టైంస్లాట్‌ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మధ్యవర్తిత్వంపై అవగాహన

తిరుపతి లీగల్‌: రాయలసీమ జిల్లాలకు చెందిన 25 మంది న్యాయమూర్తులకు ఈనెల ఆరో తేదీ నుంచి మధ్యవర్తిత్వం అనే అంశంపై అవగాహన తరగతులు నిర్వహించనున్నట్టు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్‌ తెలిపారు. రాష్ట్ర న్యాయసేవ సంస్థ, ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవా సంస్థ, తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థ సంయుక్తంగా రాయలసీమ జిల్లాలకు చెందిన 25 మంది న్యాయమూర్తులకు తిరుపతి శ్వేత భవనంలో ఈనెల ఆరో తేదీ నుంచి పదో తేదీ వరకు అవగాహన తరగతులు నిర్వహించనున్నట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు.

రేర్‌ బర్డ్స్‌.. నో వర్డ్స్‌

ప్రస్తుతం మనమంతా కాంక్రీట్‌ జంగిల్‌లో బతికేస్తున్నాం. రణగొణ ధ్వనుల మధ్య ఉషోదయం చూడాల్సి వస్తోంది. ఇలాంటి జీవితంలో కొందరు మాత్రం కిలకిలరావాల అన్వేషణ కొనసాగిస్తున్నారు. విహంగాల వైవిధ్య భరిత విశేషాలను తిలకిస్తూ పులకిస్తున్నారు. శీతల గాలులతో పాటు కదిలివచ్చే వినువీధి వైవిధ్యాల కోసం బైనాక్యులర్స్‌ చేతబట్టి బయలుదేరుతున్నారు. చలికాలంలో ఈ పక్షుల వలస ఎక్కువగా ఉంటుంది. ఒకప్పుడు ఇలాంటి వలస పక్షులకు తిరుపతిలో చాలా స్పాట్స్‌ ఉండేవి. కానీ వాటిలో కొన్ని మాత్రమే మిగిలాయి. సరస్సులు కనుమరుగవుతుండడం వల్ల వీటికి ఆవాసాలు దొరకడం లేదు.

- హుషారుగా పక్షి ప్రేమికులు
- ఈ సీజన్‌లో అరుదైన పక్షుల వీక్షణకు చాన్స్‌
- రాష్ట్రంలో 557కు పైగా అరుదైన పక్షి జాతుల గుర్తింపు
- తిరుపతి శేషాచల అడవుల్లో 220 పక్షి జాతులు
- చలికాలంలో విహంగాల రాక అధికం





SUNDAY SPECIAL

తిరుపతి మంగళం: రాష్ట్రానికి, తిరుపతికి ఏడాది పొడువునా వలస పక్షుల రాకపోకలు ఉంటాయి. తిరుపతి నగరం చుట్టూ పక్షుల వీక్షణకు వీలు కల్పించే ప్రదేశాలు చాలా ఉన్నాయి. ఒకప్పుడు శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాలలో మాత్రమే రకరకాల పక్షులను చూడగలిగేవాళ్లం. ప్రస్తుతం తిరుపతి పరిధిలోని జంగిల్‌ బుక్‌, నగరవనంతో పాటు మామండూరు, తలకోన, అటవీ ప్రాంతాల్లో సహజసిద్ధమైన వాతావరణంలో పక్షుల కిలకిల రావాలను వీక్షించేలా అటవీ అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతోపాటు శేషాచల అడవుల్లో బోలెడు అరుదైన పక్షులను వీక్షించవచ్చని జంతు ప్రేమికులు చెబుతున్నారు.

సీజన్‌ స్పెషల్స్‌ ఇవే..

వానాకాలం సమీపానికి వచ్చే పక్షుల్లో రెయిన్‌ క్వాయిల్‌ పెయింటెడ్‌ ఫ్రాంకొలిన్‌, జాకొబిస్‌ కుకూ (దీనినే మాన్‌సూన్‌ బర్డ్‌ అని కూడా పిలుస్తారు. ఇది రుతుపవనాల ప్రారంభ సమయంలో వస్తుంది) వంటివి ఉన్నాయి. ఇవి పచ్చని పచ్చిక బయళ్లలో కనిపిస్తాయి. ఇక శీతాకాలంలో వచ్చే వాటిలో వర్డియర్‌ ఫ్లై క్యాచర్‌, ఇండియన్‌ బ్లూ రాబిన్‌, బార్‌ హెడెడ్‌ గూస్‌, కాస్పియన్‌ టెర్న్‌, రాజహంసలు, బ్యాక్‌గల్‌ అండ్‌ బ్రౌన్‌ హెడ్‌గల్‌ (తక్కువ నలుపు గల పక్షులు), పిన్టైల్‌, పెలికాన్‌ వంటివి ఉన్నాయి.









కాలం మార్పుతో పక్షుల కనుమరుగు



సమాజంలో మారుతున్న సంస్కృతి వల్లే పక్షులు కనిపించడం లేదు. పూర్వకాలంలో పెంకుటిళ్లు, ఇళ్ల వద్ద పెద్దపెద్ద చెట్లు ఉండేవి. దాంతో పక్షులు అక్కడ గూళ్లు కట్టుకుని వడ్లు తినడానికి వచ్చి నివాసాలు ఉండేవి. అయితే క్రమేణా పెద్దపెద్ద బిల్డింగులు, అపార్ట్‌మెంట్లు రావడంతో పక్షులకు ఆవాసాలు కరువయ్యాయి. ఈ కారణంగా నగరాల్లో పక్షుల కిలకిలరావాలు వినిపించడం లేదు. పూర్వకాలంలో ఎవరైనా అడవుల్లో తప్పిపోతే వారికి పక్షులు దారి చూపేవి. అలాగే పక్షులు తిని పడవేసే పండ్లు వల్ల మరిన్ని చెట్లు పెరిగేవి.

– కార్తీక్‌, వైల్డ్‌లైఫ్‌ ఫొటోగ్రాఫర్‌









పార్టీ జిల్లా కార్యాలయం పరిశీలన



రేణిగుంట విమానాశ్రయం వద్ద నిర్మిస్తున్న తిరుపతి జిల్లా పార్టీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : రేణిగుంట విమానాశ్రయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయ నిర్మాణ పనులను శనివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోట రాజేష్‌ పరిశీలించారు. నూతన పార్టీ కార్యాలయ పనులు పూర్తి కావచ్చాయని, త్వరలోనే పార్టీ కార్యకలాపాలను జిల్లా కార్యాలయం నుంచి కొనసాగిస్తామని భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన వెంట కార్పొరేటర్‌ రామస్వామి వెంకటేశ్వర్లు, పార్టీ సీనియర్‌ నాయకులు మల్లం రవిచంద్రారెడ్డి, బీరేంద్రవర్మ, తలారి రాజేంద్ర, బొమ్మగుంట రవి, శేఖర్‌రాయల్‌ తదితరులు పాల్గొన్నారు.

మైస్‌ పర్యాటకానికి అవకాశాలు పుష్కలం



ఏర్పేడు ఐఐటీలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా కలెక్టర్‌ వెంకటేశ్వర్‌

రేణిగుంట: ఎంఐసీఈ(మీటింగ్స్‌, ఇన్‌సెంటివ్స్‌, కాన్ఫరెన్సెస్‌, ఎగ్జిబిషన్స్‌)తో జిల్లాలో పర్యాటక, ఆతిథ్య రంగాలకు పుష్కల అవకాశాలు ఉన్నాయని కలెక్టర్‌ డాక్టర్‌ ఎస్‌.వెంకటేశ్వర్‌ తెలిపారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో శనివారం ఉదయం ఏపీ టూరిజం అథారిటీ, జిల్లా పర్యాటక కౌన్సిల్‌ ఆధ్వర్యంలో ఎంఐసీఈ అభివృద్ధికి ఐఐటీతో ఎంఓయూ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ మైస్‌ టూరిజం కాన్ఫరెన్స్‌ ఏర్పాటుకు ఐఐటీ డైరెక్టర్‌ సహకారం మరువలేనిదని, ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లాలో మైస్‌ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలు, అనుసంధానం వంటి అంశాలపై మేథో మథనం చేసి ప్రణాళికల తయారీకి సలహాలు ఇవ్వాలని కోరారు. జిల్లాలో రోజుకు సుమారు 80 వేల నుంచి లక్ష మంది ప్రజలు వివిధ అవసరాలపై వస్తుంటారని, ప్రముఖంగా తిరుమల శ్రీవారి దర్శనానికి ఎక్కువగా వస్తుంటారని పర్యాటక రంగం ఇక్కడ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో 75 కి.మీ. సముద్ర తీరం ఉందని, 6 బీచ్‌లున్నాయని, తలకోన, అర్త్రై, టీపీ కోన, కైలాసగిరి తదితర వాటర్‌ ఫాల్స్‌ ఉన్నాయని తెలిపారు. తుంబుర తీర్థం తిరుమల కొండపైన పర్యాటక ప్రదేశం అని అన్నారు. విలక్షణమైన పర్యావరణం కలిగిన పులికాట్‌ లేక్‌, పులికాట్‌ బర్డ్‌ అభయారణ్యంలో ఫ్లెమింగో పక్షులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. ఐఐటీ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ కెఎన్‌ సత్యనారాయణ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఉన్నత కేంద్ర విద్యా సంస్థలైన ఐఐటీ, ఐజర్‌, సంస్కృత యూనివర్సిటీలు జిల్లాలోని ఉన్నాయన్నారు. ఐఐటీలో 18 క్లబ్స్‌ ఏర్పాటుతో ట్రెక్కింగ్‌, వాటర్‌ ఫాల్స్‌ సందర్శనకు, ఎకో టూరిజంలో భాగంగా యూనివర్సిటీ విద్యార్థిని, విద్యార్థులు వెళ్లడం జరుగుతోందని తెలిపారు. పుదుచ్చేరి యూనివర్సిటీ టూరిజం శాఖ ప్రొఫెసర్‌ వై.వెంకట్రావు, ఈవెంట్‌ మేనేజర్‌ డీవీ. వినోద్‌గోపాల్‌, తిరుపతి కమిషనర్‌ నారపురెడ్డి మౌర్య, జిల్లా ఫారెస్ట్‌ అధికారి పాల్గొన్నారు.

కొండపై కొత్త తళుకులు



కొండపై ప్రముఖ సినీ నటి జాన్వీకపూర్‌ తళుక్కుమన్నారు. శ్రీవారి దర్శనార్థం ఆమె శనివారం సాయంత్రం కాలినడకన తిరుమల చేరుకున్నారు. అనంతరం ఉదయం శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు, కరచాలనం అందించేందుకు పలువురు భక్తులు పోటీ పడ్డారు. – తిరుమల

విద్యార్థులకు పౌష్టికాహారం ముఖ్యం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్‌ వెంకటేశ్వర్‌, ఎమ్మెల్యే

వెంకటగిరి రూరల్‌: విద్యార్థులకు ముఖ్యంగా పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిందని కలెక్టర్‌ వెంకటేశ్వర్‌ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలసి మధ్యాహ్నభోజనం పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా పరిధిలోని 21 జూనియర్‌ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కళాశాల వయసులోనే విద్యార్థులు పౌష్టికంగా ఉండాలని సూచించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, బాల్య వివాహాలను నిర్మూలించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. తర్వాత వారితో కలసి సహఫంక్తి భోజనం చేశారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ నక్కా భానుప్రియ, జిల్లా ఇంటర్మీడియెట్‌ అధికారి విశ్వనాథ్‌నాయక్‌, జిల్లా విద్యాశాఖ అధికారి సురేష్‌, ఎంఈఓ వెంకటేశ్వర్లు, జూనియర్‌ కళాశాల ప్రిన్సిపల్‌ రవికుమార్‌ పాల్గొన్నారు.

లేరు సాటి.. నత్తే నాకు పోటీ!

- ఆరేళ్లుగా సా..గుతున్న ఇంటింటికీ తాగునీటి పనులు
- మున్సిపాలిటీల్లో అరకొర నీరే గతి
- రూ.288.10 కోట్లతో ప్రారంభమైన పనుల సంగతేంటో?
- అయోమయంలో జిల్లా వాసులు

సూళ్లూరుపేట: జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఇంటింటికీ తాగునీరు కలగా మిగిలింది. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు 2014–19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏషియన్‌ ఇన్వెస్టిమెంట్‌ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ బ్యాంక్‌ నుంచి సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీలకు రూ.288.10 కోట్లు మంజూరు చేయించింది. తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి నీళ్లు తెప్పించి తాగునీటి కొరత తీర్చే దిశగా ప్రణాళిక రూపొందించింది. 2019లో అప్పటి మంత్రి నారాయణ సూళ్లూరుపేట మున్సిపాలిటీకి రూ.142.10 కోట్లు, నాయుడుపేట మున్సిపాలిటీగా రూ.146 కోట్ల మంజూరైనట్లు శిలాఫలకాలు వేశారు. ఆ తర్వాత తూతూమంత్రంగా పనులను ప్రారంభించారు. ప్రస్తుతం పనులైతే ఇంకా చేస్తూనే ఉన్నారు.

నీటి కోసమే రోజుకు రూ.2.5 కోట్లు ఖర్చు

తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి మున్సిపాలిటీల్లో చాలీ చాలకుండా నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణాల్లోని శివారు ప్రాంతాల వారు మున్సిపల్‌ నీటికోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. విధిలేని పరిస్థితుల్లో క్యాన్‌ వాటర్‌, ట్రాక్టర్లల ద్వారా తీసుకొచ్చే లూజ్‌ వాటర్‌ బిందె నీళ్లు రూ.8 పెట్టి కొంటున్నారు. క్యాన్‌ వాటర్‌కు రూ.25 వెచ్చిస్తున్నారు. ఒక్కో మున్సిపాలిటీ పరిధిలో నీటి కోసమే రూ.50 లక్షల దాకా వెచ్చిస్తున్నట్టు తెలుస్తోంది. అంటే జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో కలిపి రోజుకు నీటి కోసం రూ.2.5 కోట్లు ఖర్చుచేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇదే అదునుగా వాటర్‌ కంపెనీలు నాణ్యత లేకుండా, ఐఎస్‌ఐ మార్కు లేకుండా నీళ్ల వ్యాపారం చేసి సొమ్ము చేసుకుంటున్నారు.



సూళ్లూరుపేట మండలం, మంగళంపాడు చెరువులో జరుగుతున్న సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌ నిర్మాణ పనులు

మంగళంపాడు చెరువుకు గంగ నీరు

బుచ్చినాయుడుకండ్రిగ సమీపంలో తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి పైపులైన్‌ ద్వారా సూళ్లూరుపేట మండలంలోని మంగళంపాడు చెరువులో సమ్మర్‌ స్టోరేజ్‌కి నీళ్లు తీసుకొచ్చేలా ప్లాన్‌ చేశారు. సమ్మర్‌ స్టోరేజీకి అనుసంధానంగా నీటి శుద్ధి చేసేందుకు ట్రీట్‌మెంట్‌ ప్లాంట్‌ ఏర్పాటు చేసే పనులు మందకొడిగా సాగుతున్నాయి. బుచ్చినాయుడు కండ్రిగ నుంచి సూళ్లూరుపేట దాకా 25 కిలోమీటర్ల మేర పైపులైన్‌ పనులను పూర్తి చేశారు. ఓవర్‌ హెడ్‌ ట్యాంక్‌లు, సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులు ప్రారంభమై ఆరేళ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాకపోవడం విమర్శలకు తావిస్తోంది.



సూళ్లూరుపేట పట్టణంలో నత్తనడకన ఓవర్‌ హెడ్‌ ట్యాంక్‌ నిర్మాణ పనులు

నిర్మాణ పనుల్లో జాప్యం

సూళ్లూరుపేట మున్సిపాలిట పరిధిలో మన్నారుపోలూరు మిట్టమీద 9 లక్షల లీటర్ల కెపాసిటీతో ఓవర్‌హెడ్‌ ట్యాంక్‌, సూళ్లూరు దళిత వాడలో 3 లక్షలు, కళాక్షేత్రంలో 12 లక్షలు, ఇసుకమిట్టలో 11 లక్షలు కెపాసిటీ ఓవర్‌హెడ్‌ ట్యాంక్‌లు నిర్మిస్తున్నారు. కానీ ఈ పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది.

నాయుడుపేటలోనూ ఇదే పరిస్థితి



ఇంటింటికీ వేసిన కొళాయిల దుస్థితి

నాయుడుపేట పట్టణంలో తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి డైరెక్ట్‌ పైపులైన్‌ల ద్వారా నాలుగు సమ్మర్‌ స్టోరేజీల్లో నీళ్లు నింపుకుని పట్టణానికి అందించాలన్నదే లక్ష్యం. తెలుగు గంగ కాలువ నుంచి పైపులైన్‌ల పనులు ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్నాయి. పట్టణంలో మాత్రం ఇంటింటికీ కొళాయిలైతే వేశారు. బీఎంఆర్‌ నగర్‌, స్వర్ణముఖినది ఒడ్డున, డీఎస్పీ కార్యాలయం సమీపంలో, పాత తహసీల్దార్‌ కార్యాలయ సమీపంలో నాలుగు సమ్మర్‌ స్టోరేజి ట్యాంక్‌ల నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. తహసీల్దార్‌ కార్యాలయం వద్ద అయితే ఇప్పటి దాకా ఎస్‌ఎస్‌ ట్యాంక్‌ నిర్మాణమే ప్రారంభం కాలేదు.

నీళ్లు కొనాల్సిందే



సూళ్లూరుపేటలో ఎంతటి వారైనా సరే నీళ్లు కొనాల్సిందే. మున్సిపాలిటీ వారు ఇచ్చే నీళ్లు ఎక్కడికీ సరిపోవు. పట్టణ శివారు ప్రాంతాలకైతే ఎట్టి పరిస్థితుల్లో నీళ్లు రావు. ఇంటింటికి కుళాయిలు వేశారే గానీ ఆ పనులు పూర్తి కాకపోవడంతో అవి అలంకార ప్రాయంగా ఉన్నాయి.

– బీ.శరత్‌గౌడ్‌, సూళ్లూరుపేట

వట్రపాళెంకి నీళ్లు సరిగా రావడం లేదు



మున్సిపాలిటీ నీళ్లు సరిగా రావడమే లేదు. వచ్చినా అవి తాగేందుకు పనికి రావు. మాలాంటి పేదోళ్లు కూడా నీళ్లు కొనుక్కుని తాగాల్సిందే. వాటర్‌క్యాన్‌ కూడా రూ.20 నుంచి రూ.25కు పెంచేశారు. ట్రాక్టర్‌ వద్ద అయిదు రూపాయలకు ఇస్తున్న బిందెనీళ్లు ఇప్పుడు రూ.8కు పెంచేశారు.

– ఎం.కౌశల్య, వట్రపాళెం, సూళ్లూరుపేట

తాగలేకపోతున్నాం



మున్సిపాలిటీ వారు ఇచ్చే నీళ్లలో శుద్ధ వస్తోంది. ఇవి తాగలేకపోతున్నాం. వాడుకోవడానికి మాత్రమే పనికొస్తున్నాయి. అందుకే తాగేందుకు నీళ్లు కొనుక్కుంటున్నాం. తాగేనీళ్లు కొంటామని కలలో కూడా అనుకోలేదు.

– అరవ రాములమ్మ, చిన్నమాల, నాయుడుపేట

మురికి నీళ్లు వస్తున్నాయి



మున్సిపాలిటీ కొళాయిల్లో మురికి నీరు వస్తోంది. ఇంటింటికీ వేసిన కొళాయిల్లో ఎక్కడా నీళ్లు రావడం లేదు. పాత కొళాయిల్లో ఎప్పుడో ఒకసారి మురికి నీళ్లు వస్తున్నాయి. పాలకులు చెప్పేది చేయరు కాబట్టి నాణ్యమైన నీళ్లుకూడా కలేననిపిస్తుంది.

– నగుటూరు వెంకటేశ్వర్లు, లోతువానిగుంట, నాయుడుపేట

క్లుప్తంగా

ఘనంగా బ్రెయిలీ దినోత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఈఓ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం పాఠశాల ఆవరణలో శనివారం ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి డీవైఈఓ బాలాజీ పాల్గొని మాట్లాడారు. తర్వాత భవిత కేంద్రంలోని విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాకురాలు తహసున్నీసాబేగం, ఎంజీఎం హైస్కూల్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ముని శారద, భానుమతి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా తవిత తులసి



సినీనటి నుంచి అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ తవిత తులసి

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ తవిత తులసికి సావిత్రీబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. భారతీయ చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో విజయవాడ వేదికగా సావిత్రీ బాయి పూలే జయంతిని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో ఉత్తమ మహిళా ఉపాధ్యాయులను అవార్డులతో సత్కరించారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాండేలే, సినీ నటి రేణు దేశాయ్, హాస్య నటుడు బ్రహ్మానందం ముఖ్యఅతిథులుగా విచ్చేసి అవార్డులను అందజేశారు. మహిళా వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజినీ ఆమెను అభినందించారు.

హథీరాంజీ మఠం ఇన్‌చార్జ్‌గా బాపిరెడ్డి



తిరుపతి కల్చరల్: శ్రీస్వామి హథీరాంజీ మఠం ఇన్‌చార్జ్ పాలనాధికారిగా శ్రీకాళహస్తి ఈవో, డెప్యూటీ కలెక్టర్ టీ.బాపిరెడ్డి నియమితులయ్యారు. గతంలో ఇన్‌చార్జ్ పాలనాధికారిగా పనిచేసిన విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ఈవో కేఎస్. రామారావు పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో 2004 డిసెంబర్ 31న రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ శ్రీకాళహస్తి ఈఓను హథీరాంజీ మఠం ఇన్‌చార్జ్ పరిపాలనాధికారిగా నియమించారు. ఈమేరకు శనివారం డెప్యూటీ కలెక్టర్ బాపిరెడ్డి గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠంలో బాధ్యతలు స్వీకరించారు.

చరిత్ర తెలుసుకో.. భవితను మార్చుకో!

- గూడూరులో రెండు రోజుల పాటు సెమినార్
- ఆంధ్రప్రదేశ్ చరిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు
- హాజరైన చరిత్ర, పరిశోధక అధ్యాపకులు



మాట్లాడుతున్న చరిత్ర పరిశోధకులు

చిల్లకూరు : చరిత్ర అనగానే గుర్తుకొచ్చేది గతం. దీని మీద పలువురు పరిశోధనలు చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయి.. వాటి విశిష్టత ఏంటి అనే విషయాలను నేటి తరానికి అందిస్తుంటారు. ఇలాంటి ఆలోచనతోనే 47 ఏళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ చరిత్ర సమాఖ్య ఏర్పాటైంది. అప్పటి నుంచి నిరాటంకంగా ఇది పనిచేస్తోంది. ఇందులో భారత దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన పరిశోధకులు సభ్యులుగా ఉంటున్నారు. ప్రతి ఏడాదీ వారు ఏ అంశంపై పరిశోధన చేశారు.. దీనికి ఉన్న ప్రాముఖ్యత ఏంటి అని ఏడాదికి ఒక సారి నిర్వహించే సెమినార్‌లో ప్రతులను సమర్పిస్తుంటారు. ఆ తరువాత వాటిని ప్రభుత్వానికి అందించి ముద్రించే ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే గూడూరులోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ అధ్యాపకులు డాక్టర్ గోవిందు సురేంద్ర చొరవతో శని, ఆదివారాలలో సెమినార్ రూపొందించారు. ఇందులో ఆంధ్రతోపాటు తెలంగాణ, అస్సాం, కర్ణాటక, కేరళ, తమిళనాడు, బెంగాల్, మణిపూర్, ఢిల్లీ, పాండిచ్చేరి ప్రాంతాలకు చెందిన మేధావులు, పరిశోధకులు, రచయితలు, సాహితీ వేత్తలు, చరిత్ర విద్యార్థులు 350 మంది వరకు పాల్గొన్నారు. వీరు ఆయా ప్రాంతాల చరిత్రపై చేసిన పరిశోధనలు వెలుగులోకి తీసుకొచ్చేందుకు చేసిన కృషిని అభినందించారు.

కొన్నేళ్లుగా పరిశోధనలు



రాయలసీమ అనగా నైజాం నుంచి దత్త మండలాలుగా వచ్చిన కర్నూలు, అనంతపురం, బళ్లారి, కడప ఉన్నాయి. అప్పటి బ్రిటీష్ కలెక్టర్ థామస్ మన్రో ఇక్కడి పేదలకు భూమి హక్కు కల్పించారు. - ఏఆర్ రామచంద్రారెడ్డి (ఎంఏపీహెచ్‌డీ, ఎస్వీయూ చరిత్ర హెడ్, విశ్రాంత ప్రొఫెసర్)

వాణిజ్య కేంద్రం గొట్టిప్రోలు



ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ఉన్న గొట్టిప్రోలు గ్రామంలో శాతవాహన కాలం నాడు ఈ ప్రాంతం వాణిజ్య కేంద్రంగా వెలుగులో ఉండేది. ఇందుకు సంబంధించిన ఆనవాళ్లు ఉన్నాయి. - టీ.శ్రీలక్ష్మి, ఎంఏఎంఫిల్, పీజీ (రీజనల్ డైరక్టర్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, ముంబయి)

సంస్కృతి, సంప్రదాయాలపై పరిశోధన



పుట్టిన గూడూరు గడ్డపై పరిశోధనలు చేయడం ఆరంభించా. చదివింది తెలుగు అయినా చరిత్ర తెలుసుకోవాలనే సంకల్పంతో గూడూరుపై పరిశోధనలు చేశా. - సోమరాజు మమత (ఎంఏ, ఎంఫిల్, తెలుగు, ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం, వెంకటాచలం)

పరీక్ష నెగ్గితేనే పింఛన్

- రేపటి నుంచి తనిఖీలు
- ఒక్కో బృందంలో ముగ్గురు డాక్టర్లు, ఒక డిజిటల్ అసిస్టెంట్
- జిల్లాకు నెల్లూరు, అన్నమయ్య జిల్లా నుంచి డాక్టర్లు
- సెక్యూరిటీ ఇవ్వాలని కోరిన వైద్యులు

తిరుపతి అర్బన్: పింఛన్ లబ్ధిదారులపై కూటమి ప్రభుత్వం పగబట్టినట్టుంది. అర్హత పరీక్ష పేరుతో ఏరివేతకు శ్రీకారం చుడుతోంది. వారు పెట్టే పరీక్షలో నెగ్గితేనే ఇకపై పింఛన్ అందుతుంది. లేదంటే కడుపు మాడ్చుకోవాల్సిన పరిస్థితే ఏర్పడుతుంది.

జిల్లాలో 27 రకాల పింఛన్లు

జిల్లాలో ప్రతినెలా 27 రకాలకు చెందిన 2,64,636 మంది లబ్ధిదారులకు రూ.112.25 కోట్ల మేర పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడు నెలల్లోనే అందులో 7,188 మందిని తగ్గించారు. మరింత మందిని తగ్గించే ప్రయత్నంలో భాగంగా పలు దశలుగా పింఛన్ల తనిఖీలు చేపట్టనున్నారు. ఈ మేరకు సోమవారం నుంచి జిల్లాలో ఏడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టనున్నారు. ఇందులో ముందుగా రూ.15వేలు పొందుతున్న పింఛన్‌దారులను తనిఖీ చేయనున్నారు.

సెక్యూరిటీ ఇవ్వండి సర్

సోమవారం నుంచి పింఛన్ తనిఖీలు మొదలుపెట్టనున్న నేపథ్యంలో ఒక్కో బృందంలో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, ఒక పీహెచ్‌సీ డాక్టర్, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అయితే సదరన్ సర్టిఫికెట్లు జిల్లా డాక్టర్లు ఇవ్వడంతో.. అదే డాక్టర్లు తనిఖీలు చేయడం సరికాదని నిర్ణయించారు. దీంతో నెల్లూరు, అన్నమయ్య జిల్లా నుంచి 14 మంది స్పెషలిస్ట్ డాక్టర్లు తిరుపతి జిల్లాకు నియమించారు. ఈ క్రమంలో డాక్టర్లు తనిఖీల సమయంలో తమకు భద్రత కావాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలుస్తోంది. దీంతో ఒక్కో బృందానికి ఒక పోలీస్‌ను ఏర్పాటు చేయనున్నారు.

మొదటి దశ ఇలా..

మంచానికే పరిమితమై పక్షవాతంతోపాటు తీవ్రమైన మస్కులర్ డిస్ట్రోఫీ సమస్యలు ఉండి జిల్లాలో నెలకు రూ.15 వేలు పింఛన్ పొందుతున్న 1,200 మందిని మొదట పరిశీలించనున్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి రోగుల ఇంటి వద్దకే వెళ్లి అర్హత పరీక్షలు చేపట్టనున్నారు. ఈ నెల 31కి తనిఖీల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. రోజుకు 25 మంది చొప్పున పరీక్షించనున్నట్లు సమాచారం.

రెండో దశ ఇలా

రెండో దశలో విభిన్న ప్రతిభావంతులతోపాటు కళాకారులు, వివిధ రోగాలకు చెందిన 23 రకాల పింఛన్‌దారుల 59,565 మందిని ఫిబ్రవరి 1వ తేదీ నుంచి తనిఖీ చేయనున్నారు.

మూడో దశలో..

మూడో దశలో మార్చి నుంచి జిల్లాలో వితంతువుల పింఛన్లు పొందుతున్న 70,341 మందివి తనిఖీ చేయనున్నారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 1 వరకు మాత్రమే భర్త చనిపోయి వితంతువులైన వారికి 240 మంది కూటమి ప్రభుత్వం జిల్లాలో కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది. నవంబర్ 1కి ముందు భర్త చనిపోయి వితంతువు అయితే వారు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వకపోవడం గమనార్హం.

నాల్గో దశలో..

4వ దశలో పింఛన్లు పొందుతున్న 1,32,890 మంది వృద్ధులను ఏప్రిల్‌లో తనిఖీ చేయనున్నారు. ఇప్పటికే ఈ ఏడు నెలల కాలంలో 7,188 మందిని తొలగించిన సంగతి తెలిసిందే. ఎందుకని అధికారులను ప్రశ్నిస్తే వారంతా మృతి చెందారని సమాధానం ఇస్తున్నారు.

6 నుంచి తనిఖీలు



ఈ నెల 7వ తేదీ నుంచి పింఛన్లు తనిఖీ చేస్తాం. ముందుగా రూ.15వేలు పొందుతున్న వారి ఇంటికి వెళ్లి వైద్య బృందంతోపాటు కమిటీలోని సభ్యులు పరీక్షలు చేపడుతారు. అర్హులా కాదా అనే అంశాలను నిర్ధారణ చేస్తారు. తర్వాత దశల వారీగా తనిఖీలు ఉంటాయి.

–శోభనబాబు, డీఆర్‌డీఏ పీడీ, తిరుపతి జిల్లా

పారదర్శకంగా తనిఖీ



పింఛన్ల తనిఖీలు పారదర్శకంగా ఉండాలి. నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవు. అడ్డదిడ్డంగా తనిఖీలు చేస్తే క్రిమినల్ కేసులు సైతం నమోదు చేస్తాం. తనిఖీలు చేపడుతున్న బృందాలకు అన్ని శాఖల అధికారులు సహకరించాలి. తనిఖీలపై ప్రత్యేక నిఘా ఉంటుంది.

–ఎస్. వెంకటేశ్వర్, కలెక్టర్

షార్ గ్రూప్ డైరెక్టర్‌కు పదోన్నతి



షార్ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన గోపీకృష్ణ

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన శ్రీహరికోట రాకెట్ కేంద్రం షార్‌కు గ్రూప్ డైరెక్టర్ (మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ ఏరియా)గా పనిచేస్తున్న గోపీకృష్ణకు డిప్యూటీ డైరెక్టర్ (మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ ఏరియా)గా పదోన్నతిని కల్పిస్తున్నట్టు భారత అంతరిక్ష కేంద్రం ప్రధాన కార్యాలయం బెంగళూరు నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు ఆయన శనివారం కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్, షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డితో పాటు సహోద్యోగులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు అభినందనలు తెలియజేశారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడ్ని అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వీవీ రమణకుమార్

చిట్టమూరు(చిల్లకూరు): చిట్టమూరు మండలంలోని ఓ గ్రామంలో మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడ్ని చిట్టమూరు పోలీసులు శనివారం అరెస్టు చేసినట్లు గూడూరు డీఎస్పీ వీవీ రమణకుమార్ తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. డిసెంబర్ 31వ తేదీన మూడేళ్ల చిన్నారి ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో ఈశ్వరవాకకు చెందిన పెనిమిటి శీనయ్య(50) పాపను బలవంతంగా ఇంట్లోకి తీసుకుని వెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపారు. శుక్రవారం ఈశ్వరవాకకు సమీపంలో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అతనిని అరెస్టు చేసి, పోక్సో కేసు నమోదు చేశారు.

ఈత రాక.. ఊపిరాడక!

- విహారంలో విషాదం
- జలపాతంలో దిగి దత్తసాయి మృతి
- సురక్షితంగా బయపడిన మరో ఐదుగురు యువకులు



దత్తసాయి (ఫైల్)

శ్రీకాళహస్తి: విహారంలో విషాదం నెలకొంది. శ్రీకాళహస్తికి చెందిన ఆరుగురు యువకులు రైల్వే కోడూరు సమీపంలోని గుంజనేరు జలపాతం వద్దకు శుక్రవారం వెళ్లారు. ఈ ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా.. ఐదుగురు సురక్షితంగా బయటపడ్డారు. బంధువులు, స్థానికుల వివరాలు.. శుక్రవారం ఉదయం 7గంటల ప్రాంతంలో శ్రీకాళహస్తికి చెందిన దినేష్, గిరి, కేదార్, పీ.దినేష్, మోహన్, దత్తసాయి(25) అనే ఆరుగురు యువకులు విహార యాత్రకని గుంజనేరు జలపాతం వద్దకు వెళ్లారు. అక్కడ సరదాగా ఈతకొట్టేందుకు ప్రయత్నించారు. అయితే వారిలో ఒకరిద్దరికి తప్ప మిగిలిన వారికెవ్వరికీ ఈత రాదు. ఈ క్రమంలో దత్తసాయి లోతైన ప్రాంతానికి వెళ్లడంతో ఊపిరాడక సాయంత్రం 3.30గంటల ప్రాంతంలో మృతి చెందాడు. మృతుని స్నేహితులు దత్తసాయి తల్లిదండ్రులకు సమాచారం చేరవేశారు. వారు రైల్వే కోడూరు, రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. తర్వాత బంధువులు, అటవీశాఖ అధికారులు, పోలీసులు కలిసి కోడూరు రైల్వేస్టేషన్‌కు 15 కిలోమీటర్ల దూరంలో శేషాచలం అడవుల్లో గల జలపాతం వద్దకు అర్ధరాత్రి 12 గంటలకు చేరుకున్నారు. ఆ తర్వాత వేకువ జాము రెండు గంటల ప్రాంతంలో దత్తసాయి మృతదేహాన్ని అటవిశాఖ జీపులో కోడూరుకి తీసుకొచ్చారు. కోడూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి శ్రీకాళహస్తికి తరలించారు. ఐదుగురు యువకులను రైల్వే కోడూరు పోలీసులు విచారిస్తున్నారు.

శివయ్య చెంత అలరిస్తూ..డ్రమ్స్ వాయిస్తూ

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిరోజూ జరిగే ఏకాంత సేవలో ఆలయం వెలుపల శివయ్యకు నేరుగా గల నంది విగ్రహం వద్ద తన మిత్రులతో కలిసి దత్తసాయి డ్రమ్స్ వాయించేవాడు. అలాగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వంటి ప్రత్యేక ఉత్సవాల్లో నాలుగు మాడవీధుల్లో డ్రమ్స్ వాయిస్తూ భక్తులను ఆకట్టుకునేవారు. అతని మృతికి ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, పూజారులు విచారం వ్యక్తం చేశారు.

ఒక్కడే కొడుకు

దత్తసాయి తండ్రి ఈశ్వరరెడ్డి చిరుద్యోగి. తల్లి ఓ ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. వారికి కుమార్తె, కుమారుడు దత్తసాయి ఉన్నారు. కుమార్తె బీటెక్ చదువుతుండగా.. పెద్దవాడైన దత్తసాయి ఓపెన్ డిగ్రీ చేసి ఖాళీగా ఉంటున్నాడు. ఒక్కగానొక్క కుమారుడు దూరమవడంతో కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కలచివేసింది.

మీకోసం పనిచేసినా గుర్తింపు లేదు!

- ఆరు నెలలుగా కార్యకర్తలు తీవ్ర నిరాశతో ఉన్నారు
- ఎమ్మెల్యే నాని కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కుమార్‌రాజారెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: మీకోసం ఎంతో మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు పనిచేశారు. మీరు ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత, కార్యకర్తలను పట్టించుకోకపోవడంతో వారు తీవ్ర నిరాశతో ఉన్నారు. మీరు కార్యకర్తలను కూడా గుర్తించాలంటూ టీడీపీ సీనియర్ నాయకుడు, సీఎం చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు కుమార్‌రాజారెడ్డి, ఎమ్మెల్యే పులివర్తి నానికి సూచించడం హాట్ టాపిక్‌గా మారింది. శనివారం చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోని ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నానితో పాటు టీడీపీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు కుమార్ రాజారెడ్డి మాట్లాడుతూ.. చంద్రగిరిలో టీడీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడ్డారన్నారు. మీరు ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నేటి వరకు కార్యకర్తలను పట్టించుకోకపోవడంతో వారు తీవ్ర నిరాశలోకి కూరుకుపోయారంటూ సభాసాక్షిగా ఆయన తెలిపారు. గత ఆరు నెలలుగా కార్యకర్తలు మిమల్ని కలవాలంటే కూడా ఇబ్బందులు తప్పడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలే కాకుండా మీకోసం..మీ వెంట నడిచిన కార్యకర్తలను కాస్త గుర్తించాలంటూ ఆయన ఎమ్మెల్యే నానిని కోరారు. వెంటనే ఎమ్మెల్యే నాని.. ఈ కార్యక్రమంలో రాజకీయాల గురించి వద్దని, తర్వాత చూసుకుందామంటూ ఆయనకు తెలిపారు.

తమ్ముళ్లలో చర్చకు లేపిన కామెంట్స్

కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతల్లో ముందున్నంత జోష్ కనిపించడం లేదన్నమాటకు శనివారం ఆ పార్టీ సీనియర్ నాయకుడు చేసిన కామెంట్స్‌కు బలం చేకూరుతున్నాయి. చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేగా పనిచేసిన నాటి నుంచి కుమార్ రాజారెడ్డి టీడీపీలోనే కొనసాగుతున్నారు. చంద్రగిరిలోని సీఎంకు సన్నిహితుడిగా కూడా ఆయనకు మంచి పేరుంది. సీనియర్ నేత అయిన ఆయన, టీడీపీ కార్యకర్తలను ఎమ్మెల్యే నాని పట్టించుకోవడం లేదన్న అర్థంలో మాట్లాడటంపై ఆ పార్టీ తమ్ముళ్లు బహిరంగంగా కాకున్నా..లోలోపల తీవ్ర స్థాయిలో చర్చించుకుంటున్నట్లు సమాచారం. ఆరు నెలల్లో పార్టీ కార్యకర్తలకు ఎమ్మెల్యే నాని సరైన గుర్తింపు ఇవ్వలేదని, తనకు ఆదాయం సమకూర్చే వాళ్లను తప్ప, మిగిలిన వారిని పట్టించుకోవడం లేదంటూ చర్చించుకుంటున్నారు. ఇన్నాళ్లకు తమ ఆవేదనను వేదిక సాక్షిగా ఎమ్మెల్యే సమక్షంలో కుమార్ రాజారెడ్డి చెప్పడంపై, మా అందరిలోని మాటను, అందరూ ఉన్నప్పుడే వ్యక్తం చేయడంతో అక్కడి వారు చర్చించుకోవడం కొసమెరుపు.

12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి మంగళం : శేషాచలం అటవీ ప్రాంతంలో 12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఒక స్మగ్లర్‌ను శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీలు జీ. బాలిరెడ్డి, వీ.శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ టీమ్ శుక్రవారం రాత్రి తిరుమల శేషాచలం అడవుల్లో కూంబింగ్ చేపట్టినట్టు ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. శనివారం అటవీ ప్రాంతంలో ఒక వ్యక్తి తచ్చాడుతూ కనిపించాడని, అతను పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకుని, విచారించినట్టు వెల్లడించారు. దాంతో ఒక డంప్‌లో దాచి ఉంచిన 12 ఎర్రచందనం దుంగలు చూపించాడన్నారు. అతను తమిళనాడుకు చెందిన వ్యక్తి గా గుర్తించి అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. దుంగలతో సహా తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేశారు.

తాగుబోతుల వీరంగం



అతిథి గృహంలో మద్యం సీసాలు

శ్రీకాళహస్తి: దేవస్థానానికి చెందిన వరదరాజస్వామి ఆలయ అతిథి గృహంలో కొందరు యువకులు శనివారం మద్యం సేవించి వీరంగం సృష్టించారు. అక్కడి సిబ్బంది వారిని ప్రశ్నిస్తే తాను అతిథి గృహం ఉద్యోగి కొడుకు అని.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ సమాధానం చెప్పినట్టు తెలిసింది. దీంతో సిబ్బంది ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ మేరకు అతిథి గృహంలో విధుల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మాధవరెడ్డి, ఒప్పంద ఉద్యోగి లక్ష్మణరెడ్డిని విధులు నుంచి నిలుపుదల చేస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. గతంలో ఓ సెక్యూరిటీ ఉద్యోగి శివగోపురం పక్కన మద్యం, మాంసం సేవించిన వీడియో వైరల్ మారింది.